క్లుప్తంగా

నీటమునిగిన పంటపొలాలు పరిశీలన



నంగేగడ్డ(నాగాయలంక): నియోజకవర్గంలో 80శాతం వరిపొలాలు మంగళవారం రాత్రి కురిసిన భారీవర్షానికి పూర్తిగా మునిగాయని వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని మర్రిపాలెం, నంగేగడ్డ ప్రాంతాల్లో బుధవారం ఆయన నీటి మునిగిన వరిపొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులను క్షేత్రస్థాయికి పంపించి నష్టాన్ని అంచనా వేసి రైతాంగానికి నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు రమేష్‌బాబును కలసి తమ గోడు వినిపించారు. పార్టీ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు బీసాబత్తిన ప్రసాద్, యూత్ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరి చెన్ను రంగారావు, మద్ది వెంకట నారాయణ(చిన్నారి), చింతలపూడి బాలు, తోట కృష్ణ, తోట సాయిబాబు, రేమాల నాగరాజు, బీమా బాబూరావు, మద్ది కొండలు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి

చల్లపల్లి: మురుగు డ్రెయిన్లలో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలి ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాతమాజేరు, కొత్తమాజేరులోని ముంపునకు గురైన పంట పొలాలను, గుండేరు మేజర్ డ్రెయిన్‌ను బుధవారం ఏపీ రైతు సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ, జిల్లా కార్యదర్శి గుత్తికొండ రామారావు, నియోజకవర్గ కార్యదర్శి వేమూరి రత్నగిరిరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబు, రైతు నాయకులు చంద్ర సుబ్బారావు, సిద్ధాబత్తుల వాసు తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ముంపునకు గురైన పొలాల రైతులకు ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

పేదలను దాతలు ఆదుకోవాలి



మచిలీపట్నంటౌన్: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ–4 (పబ్లిక్ ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమం దేశానికి ఆదర్శంగా నిలుస్తుందని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. నగరంలో నిర్వహించే అన్నక్యాంటీన్‌కు రూ. లక్ష, అన్నాక్యాంటీన్‌లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు రూ. 74,340 మొత్తం రూ. 1,74, 340ల చెక్కులను వైద్యుడు బృందావనం ధన్వంతరి ఆచార్య బుధవారం మంత్రి కొల్లు రవీంద్రకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు ముందుకురావాలని కోరారు. కార్పొరేషన్ కమిషనర్ సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, బ్రాహ్మణ సంఘం నాయకుడు పీవీ ఫణికుమార్ పాల్గొన్నారు.

నెలకుర్రులో పర్యటించిన పేర్ని కిట్టు



కోనేరుసెంటర్: మండల పరిధిలోని నెలకుర్రు గ్రామంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పేర్ని కిట్టు బుధవారం పర్యటించారు. మండలంలో కురిసిన వర్షానికి నీటమునిగిన పొలాలను ఆయన పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ధైర్యం చెప్పారు. అనంతరం గ్రామంలో యూరియా కోసం రైతులు పడుతున్న అవస్థలను చూసి ప్రభుత్వంపై మండిపడ్డారు. రైతులకు న్యాయం జరిగే వరకు రైతుల పక్షాన తమ పోరాటం ఆగదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జన్ను రాఘవ, గణేశన రమేష్, మేడింపూడి అనిల్, గ్రామ నాయకులు వెంకటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, గాంధేయుడు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

కృత్తివెన్ను: ఉపాధిహామీ పథకంలో చేసిన పనులకు సంబంధించిన అన్ని రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ అప్‌డేట్ చేసుకోవాలని ఆ పథకం మచిలీపట్నం క్లస్టర్ ఏపీడీ నాగసురేష్ ఎఫ్ఏలకు సూచించారు. బుధవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధిహామీ అధికారులు, ఎఫ్ఏలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఎవెన్యూ ప్లాంటేషన్, హార్టికల్చర్ ద్వారా నాటిన మొక్కల నిర్వహణపై ఆరా తీశారు. సమావేశంలో ఏపీవో సైదారావు, టీఏలు శ్రీనివాస్, కళ్యాణ్, సీవో రామయ్య, ఎఫ్ఏలు పాల్గొన్నారు.



నిండుకుండలా ప్రవహిస్తున్న రత్నకోడు డ్రెయిన్



పిట్టల్లంకలోని వరిపొలాల్లో చేరిన వర్షంనీరు



పాగోలు శ్రీనగర్ కాలనీలో మునిగిన రోడ్డు



వర్షం నీటిలో కోడూరులోని వరినారుమళ్లు, నాట్లు

దివిసీమ నీట మునక

- కుండపోత వర్షానికి చెరువులను తలపిస్తున్న పంటపొలాలు
- పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్లు
- పలుచోట్ల చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం



కోడూరు మండలం గుడుమోటులో నీటమునిగిన పొలంలో వరిదుబ్బులు చూపుతున్న రైతు

అవనిగడ్డ: నిన్నటి వరకు రైతులు సాగునీటి ఇబ్బందులు పడ్డారు. మంగళవారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పలుచోట్ల కుండపోత వాన కురిసింది. దీంతో జిల్లాలోని అవనిగడ్డ, కోడూరు, నాగాయలంక, మోపిదేవి, చల్లపల్లి, ఘంటసాల, పెడన, బంటుమిల్లి ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగి ప్రవహించడంతో వేలాది ఎకరాల్లో వరి పంట నీటమునిగింది. మరో నాలుగు రోజులు వర్షాలు ఉంటాయన్న వాతావరణ శాఖాధికారుల సూచనలు రైతుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తున్నాయి. దివిసీమలో పలుచోట్ల ప్రధాన రహదారులపై నాలుగడుగుల మేర నీరు చేరి కాలువలను తలపించాయి. ఈదురు గాలులతో కురిసిన వర్షానికి దివిసీమలో పలుచోట్ల చెట్లు విరిగి రోడ్డుపై పడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. ఘంటసాల మండలం శ్రీకాకుళంలో ఏకరాతి మల్లికార్జునస్వామి ఆలయం నీట మునిగింది. మోపిదేవి మండలం టేకుపల్లిలో రామేశ్వరస్వామి ఆలయంలోకి వర్షం నీరు చేరింది.



నడకుదురు వద్ద కరకట్ట రోడ్డుపై పడిన భారీ వృక్షం

చల్లపల్లిలో అత్యధికంగా 177.2 మి.మీ వర్షపాతం

మంగళవారం రాత్రి చల్లపల్లిలో అత్యధికంగా 177.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నాగాయలంకలో 143.8, అవనిగడ్డలో 137.2, కోడూరులో 126.2, మోపిదేవిలో 108.2, బంటుమిల్లిలో 87.2, ఘంటసాలలో 83.2, పెడనలో 40, మచిలీపట్నంలో 32.6, గూడూరులో 28.8, కృత్తివెన్నులో 16.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

నిండా ముంచిన అక్రమ వలకట్లు

కోడూరు: దివిసీమలోని పంటపొలాల్లో మురుగు సముద్రంలోకి వెళ్లేందుకు దోహదపడే రత్నకోడు (తాలేరు) డ్రెయిన్‌లో కొంతమంది స్వార్థపూరితంగా ఏర్పాటు చేసిన అక్రమ వలకట్లు నేడు దివిసీమ రైతుల పాలిట శాపంగా మారాయి. కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ మండలాలకు చెందిన సుమారు 25 వేల ఎకరాల్లో మురుగు పోయేందుకు రత్నకోడు ప్రధాన డ్రెయిన్ దోహదపడుతుంది. అయితే కోడూరు మండలంలోని చిన గుడుమోటు దగ్గర నుంచి నాగాయలంక మండలం సంగమేశ్వరం వరకు ఈ డ్రెయిన్‌లో ఎలాంటి అనుమతులు లేకుండా సుమారు 32 వలకట్లు ఏర్పాటు చేయడంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. ఈ వల్లకట్లను తొలగించాలని రైతులు ఖరీఫ్ ప్రారంభంలోనే గొడవ చేసినా డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదు. వలకట్లు ఉన్న ప్రాంతంలో సరుకు బాదులను నీటిలో ఒత్తుగా ఏర్పాటు చేసి, పాలిథిన్ కవర్లు, తడికిలు అడ్డుకట్టడంతో నీటి ప్రవాహం దిగువకు వెళ్లడం లేదు. పరిసర గ్రామాల్లో సుమారు 30వేలు ఎకరాల వరిపంట మునకబారింది. వలకట్ల విషయంపై రైతుల నుంచి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తం రావడంతో అధికారులు నష్ట నివారణ చర్యలకు చేపట్టి, వలకట్లను తొలగించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

పొంగి పొర్లుతున్న డ్రెయిన్లు

చల్లపల్లి: చల్లపల్లి పరిసర ప్రాంతాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. మండలంలోని పలు కాలనీలు ఈ వర్షానికి జలమయమయ్యాయి. మండలంలో ప్రధానంగా చిల్లలవాగు, బండ్రేవుకోడు, గుండేరు డ్రెయిన్లు ఉన్నాయి. బండ్రేవుకోడు కాలువ పైస్థాయి వరకు నీరు చేరింది. చిల్లలవాగులో అమాంతం నీటి మట్టం తారాస్థాయికి చేరుకుంది. చిల్లలవాగు గట్లు బలహీనంగా ఉండటంతో ఎక్కడ డ్రెయిన్ కట్టలు తెగి నీరు పొలాల మీద పడుతుందోనని ఆయా ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 12,295 ఎకరాల్లో వరి సాగు చేయగా వాటిలో 1,765 ఎకరాలు ముంపు బారిన పడినట్లు ప్రాథమిక పరిశీలనలో తేలిందని మండల వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణ బుధవారం తెలిపారు.

కోడూరు: భారీ వర్షాలకు వరిపొలాలు మొత్తం నీట మునిగి చెరువులను తలపిస్తున్నాయి. మండలంలోని లింగారెడ్డిపాలెం, చినగుడుమోటు, కృష్ణాపురం, వి.కొత్తపాలెం, విశ్వనాథపల్లి, పిట్టల్లంక, నరసింహాపురం, కోడూరు, జయపురం, జరుగువానిపాలెం, మందపాకల గ్రామాల్లోని వరిపైరు నీటిలో మునిగిపోయింది.

నాగాయలంకలో 143.8మి.మి వర్షపాతం



నాగాయలంక మండలంలోని మర్రిపాలెం సమీపంలో చెరువును తలపిస్తున్న పొలాలు



భావదేవరపల్లిలో వరిపొలాలు, ఉపకాల్వలు, డ్రెయిన్లు ఏకమైన దృశ్యం

నాగాయలంక: ఎడతెరపి లేకుండా కురిసిన వర్షానికి మండలంలోని పొలాలు నీటమునిగి జలాశయాలుగా మారాయి. మండలంలో దాదాపు 10వేల ఎకరాల్లో వరిపైరు మునిగినట్లు ఇరిగేషన్ ఏఈఈ పొన్నూరు రవితేజ ధృవీకరించారు. బుధవారం ఉదయానికి వర్షపాతం 143.8మి.మి నమోదైనట్లు తహశీల్దార్ ఆంజనేయప్రసాద్ తెలిపారు. వరిపొలాలు మునకపై ప్రాథమిక అంచనాలు వేస్తున్నామమని ఆయన చెప్పారు. మండలంలోని భావదేవరపల్లి రెవిన్యూ పరిధిలో సెంట్రల్ ఛానల్ దీని ఉప కాల్వల కింద, చోడవరం పత్ర, నంగేగడ్డ, మర్రిపాలెం పేర్లవాని లంక తదితర ఎగువ, దిగువ పొలాల్లో వేసిన నాట్లు పూర్తిగా నీటిలో మునిగి పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఉపకాల్వలు, డ్రయిన్‌లు, పొలాలు ఏక మొత్తంగా జలాశయాలు కావడంతో మురుగు పారుదల ప్రభావం స్తంభించి ఎక్కడిక్కడ నీరు ఎగతట్టిందని రైతులు తెలిపారు. గ్రామంలోని పురాతానమైన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం గర్భగుడితో సహా మునిగిపోయింది.

ఇళ్లల్లోకి చేరిన వర్షంనీరు

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం గ్రామంలోని శ్రీఏకరాత్రి ప్రసన్న మల్లికార్జునస్వామి ఆలయం మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఘంటసాల మండలం తెలుగురావుపాలెం ఎస్సీ కాలనీలో వర్షం నీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఘంటసాలలో పశువుల ఆసుపత్రికి వెళ్లే రోడ్డు, ఘంటసాల – రామానగరం రోడ్డు, జగనన్న కాలనీ, గోటకం ఏ, బీ కాలనీల్లో పలు రోడ్లు జలమయం కాగా ఇళ్లల్లోకి నీరు చేరింది. ఘంటసాల మండలంలోని డ్రెయిన్లు, కాలువలు ఉప్పొంగడంతో చిలకపూడి – వి.రుద్రవరం గ్రామాల మధ్య, బొల్లపాడు, మల్లంపల్లి, పాపవినాశనం, ఘంటసాల తదితర గ్రామాల్లోని పొలాలు నీట మునిగాయి. ప్రముఖ బౌద్ధ క్షేత్రంగా విరాజిల్లుతున్న ఘంటసాల గ్రామంలోని బౌద్ధ స్థూపం చుట్టూ వర్షపు నీరు చేరింది.



తెలుగురావుపాలెంలో ఇంటిలోకి వచ్చిన వర్షంనీరు



జరుగువానిపాలెం వద్ద రత్నకోడు డ్రెయిన్‌లో ఏర్పాటు చేసిన అక్రమ వలకట్టు



వక్కలగడ్డలో నీట మునిగిన పొలాల వివరాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు



పాగోలు శివారు శ్రీనగర్ వద్ద చెరువును తలపిస్తున్న పంటపొలాలు



అవనిగడ్డ ప్రధాన రహదారిపై నిలిచిన వర్షం నీరు

టేకుపల్లి(మోపిదేవి): గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు గుడి, గృహాల్లోకి వర్షం నీరు భారీగా చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని టేకుపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీబాలా పార్వతీ సమేత రామేశ్వర స్వామివారి దేవస్థానం గర్భాలయంలోకి నీరు చేరింది. వెంకటాపురం కాలనీలోని అంతర్గత రోడ్లన్నీ నీటమునిగాయి.



వర్షంనీటిలో నాగాయలంక సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం



నీటమునిగిన అవనిగడ్డ ఆర్టీసీ డిపో ఆవరణం



తాగునీటి కోసం వర్షంనీటిలో వస్తున్న వెంకటాపురం కాలనీవాసులు

సంక్షిప్తం

• అధిక మోతాదులో ఎరువులు అనర్థం

మోపిదేవి: అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హత కలిగిన రైతుల ఖాతాల్లో నగదు జమ చేసినట్లు అవనిగడ్డ సహాయ వ్యవసాయ సంచాలకులు జె.ఎస్. జయప్రద తెలిపారు. మండల కేంద్రం మోపిదేవి, రావివారిపాలెం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ పథకం కింద నగదు జమ కాని రైతులు ఉన్నట్లయితే రైతుసేవా కేంద్రాల్లో సంప్రదించి అర్జీ పెట్టుకోవచ్చునని తెలిపారు. మండలంలో దాదాపు 90 శాతం పంటలు వేసేశారని, తప్పనిసరిగా ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. అధిక మోతాదులో యూరియా వాడకూడదని సూచించారు. మండల ఏఓ హెప్సీబారాణీ, వీఏఏలు యశ్వంత్, రవిచంద్ర, రైతులు పాల్గొన్నారు.

పెడన: మండలంలోని పుల్లపాడు గ్రామంలో పెడన ఏవో ఎస్ జెన్నీ పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

• యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు

పెడన: మచిలీపట్టణం సబ్‌డివిజన్ పరిధిలోని మచిలీపట్నం, పెడన, గూడూరు మండలాల్లో యూరియాను బ్లాక్‌లో విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పెడన ఏవో ఎస్. జెన్నీ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎక్కువగా అమ్మితే వారి నుంచి ఆ సరుకును సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. వ్యాపారస్తుల లైసెన్సులు రద్దు చేసి పోలీస్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

• చెన్నూరులో రూ.1.20లక్షలు చోరీ

పెడన: మండలంలోని చెన్నూరు గ్రామం మెయిన్ రోడ్డులోని పచారి షాపులో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. పెడన పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన యర్రంశెట్టి రామాంజనేయులు, రమేష్ సోదరులు పచారి షాపును నిర్వహిస్తున్నారు. మంగళవారం దుకాణంలో రూ.1.20లక్షలు నగదు ఉంచి సమీపంలోని ఇంటికి వెళ్లారు. బుధవారం షాపు తీయకుండా సరుకుల కోసం విజయవాడ వెళ్లి సాయంత్రం రావడంతో చోరీ జరిగినట్లు గుర్తించి పెడన పోలీసులకు ఫిర్యాదు చేశారు. షాపుపై రేకులను పగలగొట్టి దొంగలు లోపలకు ప్రవేశించి నగదు అపహరించుకుపోయారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

• సబ్సిడీపై డ్రోన్ పంపిణీ

శ్రీకాకుళం(ఘంటసాల): శ్రీకాకుళం గ్రామంలోని శ్రీకాకుళేశ్వర సీహెచ్ఎస్ డ్రోన్ గ్రూపు సభ్యులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సబ్సిడీపై డ్రోన్‌ను రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ఏవో రామమోహనరావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా 80 శాతం సబ్సిడీతో డ్రోన్ అందించినట్లు తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు వెంకటేశ్వరరావు, యూనియన్ బ్యాంకు మేనేజర్ అన్వేష్, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

• దేవాంగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం వివక్ష

గూడూరు: దేవాంగ కులంపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న వివక్షను తీవ్రంగా ఖండిస్తున్నట్లు దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పడవల మోహనత్రినాథ్ బుధవారం ఒక ప్రకటన పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్లలో దేవాంగ కార్పొరేషన్ పాలకవర్గం ఊసే లేకపోవడం చాలా దారుణం అన్నారు. సీఎం చంద్రబాబు తక్షణమే పాలకవర్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

• చిన్నతరహా పరిశ్రమలకు 55 దరఖాస్తులు

బంటుమిల్లి: మండలంలోని డ్వాక్రా గ్రూపు సభ్యులు తాము చేపట్టబోయే చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు 55 దరఖాస్తులు అందాయని పరిశ్రమల శాఖ అసిస్టెంటు డైరెక్టరు బి. మనోజ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఔత్సాహికుల నుంచి వచ్చిన దరఖాస్తులను ఆయన ఆన్‌లైన్ చేశారు. పెదతుమ్మిడి ఎంపీటీసీ ఎం. రుక్మిణి, ఏపీఎం దశరథ్, పలు గ్రామాల బుక్ కీపర్లు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

• ఇద్దరు విద్యార్థులు అదృశ్యం

అవనిగడ్డ: ఇద్దరు విద్యార్థులు అదృశ్యమైన ఘటన అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. గుడివాకవారిపాలెంకు చెందిన గుడివాక రామకృష్ణ, అవనిగడ్డకు చెందిన విక్కుర్తి కార్తీక్‌నాథ్ స్థానిక శ్రీచైతన్య స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నారు. వీరు ఇద్దరు మధ్యాహ్న భోజనం చేసేందుకు కార్తీక్‌నాథ్ ఇంటికి వెళ్లారు. భోజనం చేసిన తర్వాత ఇద్దరూ స్కూల్‌కు వెళుతున్నామని చెప్పి వచ్చారు. సాయంత్రం అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఘనంగా హర్ ఘర్ తిరంగా



మచిలీపట్నంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

బంటుమిల్లి: కేంద్ర ప్రభుత్వం పిలుపు మేరకు బీజేపీ మండల పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కాలేజీ విద్యార్థులతో కలసి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్ హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సెంటర్లో విద్యార్థులు మానవహారం నిర్వహించి భారత్ మాతాకీ జై, వందేమాతరం అంటూ నినాదాలు చేశారు. అనంతరం తాతినేని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మువ్వన్నెల పతాకాన్ని ఇంటిపై ఎగురవేయాలని కోరారు. ముడ చైర్మన్ మట్టా ప్రసాదు, బంటుమిల్లి, కృత్తివెన్ను మండల పార్టీ అధ్యక్షులు జే. కిరణ్‌గుప్త, కే. ఏసురాజు, పార్టీ ప్రధాన కార్యదర్శి పి. రాము, పెడన నియోకవర్గ కోకన్వీనరు ఎం. గంగరాజు, మండల ఉపాధ్యక్షులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెడనలో..

పెడన: పట్టణంతోపాటు మండలంలోని వివిధ పాఠశాలలో బుధవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. పట్టణంలోని బంగ్లా స్కూలు, చెన్నూరు జెడ్పీహెచ్ఎస్, కొంగంచర్ల పంచాయతీ కార్యాలయం వద్ద జాతీయ పతాకంతో అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈఓ వై. హరినాథ్, ఇన్‌చార్జ్ ఎంపీడీవో కె. శివప్రసాద్, డెప్యూటీ ఎంపీడీవో ఎం. నాగిరెడ్డి, విశ్రాంత అధికారి రాధాకృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మచిలీపట్నంటౌన్: బీజేపీ కృష్ణా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం కోనేరు సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకు విద్యార్థులతో కలిసి హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కన్వీనర్ ఏలూరి పవన్, జిల్లా అధ్యక్షుడు తాతినేని శ్రీరామ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పంతం వెంకటగజేంద్ర, నాయకులు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఘంటసాల: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యాన ఘంటసాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

స్వామివారి సన్నిధిలో టీపీసీసీ అధ్యక్షుడు



మోపిదేవి: మోపిదేవిలో కొలువు తీరిన శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారిని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ దంపతులు మంగళవారం రాత్రి దర్శించుకున్నారు. తొలుత ఆలయ ప్రదక్షిణ చేసి నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం అందించి ఆలయ మర్యాదలతో సత్కరించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ, ఏపీపీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, జాతీయ మానవ హక్కుల రాష్ట్ర చైర్మన్ రాజులపాటి శివప్రసాద్, చల్లపల్లి జెడ్పీటీసీ సభ్యురాలు రాజులపాటి కళ్యాణి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, కొంతి నాగరాజు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, బీసీ మండల కన్వీనర్ రాజులపాటి నాగేశ్వరరావు, బీసీ సంఘం మండల నేత బెల్లంకొండ ఏడుకొండలు, గోళ్ల వెంకటసుబ్బారావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు దనేకుల మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు ఆది రామ్మోహనరావు, మీర్ రిజ్వాన్, పఠాన్ కరీముల్లా ఖాన్ తదితరులు పాల్గొన్నారు.